
సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 9 । జూన్ । 2025



సంక్షోభంలో మామిడి రైతులు

బంగినపల్లి మామిడి రైతులను, వ్యాపారులను సంక్షోభంలోకి నెట్టేసింది. ప్రతికూల వాతావరణం, నల్లతామరతో దిగుబడులు తగ్గగా.. ధర కూడా లేదు. 8లో



ఖర్చంతా గ్రంథ పాలకులదే

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహించగా.. జిల్లా గ్రంథాలయ సంస్థ ఒక్క రూపాయి కూడా నిర్వహణ ఖర్చులు మంజూరు చేయలేదు. 8లో



కొనసాగిన భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల : శ్రీవారి క్షేత్రంలో ఆదివారం సైతం భక్తుల రద్దీ కొనసాగింది. వేసవి సెలవులు ముగుస్తుండటంతో క్షేత్రానికి భక్తులు పోటెత్తారు.

న్యూస్‌రీల్

శ్రమ పాత్ర కీలకం



మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

ఏలూరు టౌన్: సమాజ పరిమాణం, అభివృద్ధిలో శ్రమ పాత్ర కీలకమని సినీ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. స్థానిక టుబాకో మర్చంట్స్ కల్యాణ మండపంలో సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన 60వ శ్రమ కావ్యం–గానం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ ఆహ్వానం పలకగా జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అశోక్ తేజ తాను రచించిన శ్రమకావ్యం పుస్తకంలో అనేక ఘట్టాలను ఆలపిస్తూ సవివరంగా విశ్లేషించారు. రిటైర్డ్ రిజిస్ట్రార్ లంక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్రమ కావ్యం రచనలో శ్రమను వస్తువుగా తీసుకుని రచన చేయడం సాహసోపేతం అన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వాలని సీఐటీయూ దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తోందన్నారు. జూలై 9న దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించనున్నట్టు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మంతెన సీతారాం తదితరులు పాల్గొన్నారు.

నేడు 'షైనింగ్ స్టార్స్' అవార్డుల ప్రదానం

భీమవరం : జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన టెన్త్, ఇంటర్ విద్యార్థులను షైనింగ్ స్టార్స్ అవార్డులు ఇవ్వనున్నట్టు కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. సోమవారం స్థానిక ఏఎస్ఆర్ సాంస్కృతిక కేంద్రంలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను 10వ తరగతిలో ప్రతిభ కనబర్చిన 119 మంది, ఇంటర్‌లో ప్రతిభ చూపిన 34 మందికి అవార్డులు అందిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారని, విద్యార్థులకు సర్టిఫికెట్, మెడల్, రూ.20 వేలు చెక్ రూపంలో అందిస్తారన్నారు.

216 ఎన్‌హెచ్‌పై ఆంక్షలు



నరసాపురం: ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా 216 జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం 2 గంటలు నుంచి మంగళవారం ఉదయం10 గంటలు వరకూ ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నరసాపురం–మొగల్తూరు–మచిలీపట్నం మార్గంలో ట్రాఫిక్ దారి మళ్లించనున్నారు. దిగమర్రు నుంచి నరసాపురం, మొగల్తూరు మీదుగా మచిలీపట్నం వైపు వెళ్లే వాహనాలు దిగమర్రు, పాలకొల్లు, భీమవరం, లోసరి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. మచిలీపట్నం నుంచి నరసాపురం వచ్చే వాహనాలు ముత్యాలపల్లి సెంటర్ మీదుగా వారతిప్ప, వెంప, కొప్పర్రు, లిఖితపూడి. సరిపల్లి మీదుగా దారి మళ్లించారు. పాలకొల్లు నుంచి నరసాపురం మీదుగా మచిలీపట్నం వెళ్లే వాహనాలు భీమవరం, లోసరి చేరుకోవాలని మొగల్తూరు పోలీసులు ప్రకటన విడుదల చేశారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



ఏలూరులో తనిఖీలు చేస్తున్న రైల్వే పోలీసులు

ఏలూరు టౌన్: ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. విజయవాడ రైల్వే డీఎస్పీ జి.రత్నరాజు పర్యవేక్షణలో విజయవాడ లైన్ సర్కిల్ సీఐ ఎంవీ దుర్గారావు, ఏలూరు రైల్వే ఎస్సై పి.సైమన్ ఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్స్, వెయిటింగ్ హాల్స్, బుకింగ్ కార్యాలయం, రిజర్వేషన్ కౌంటర్లు, పార్సిల్ కార్యాలయం, ఆర్ఎంఎస్‌లో పూర్తిస్థాయిలో పరిశీలించారు. గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించిన రైల్వే పోలీస్ ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలకు ఆదేశాలు ఇచ్చారని, దీంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టామని ఎస్సై సైమన్ చెప్పారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

ఏలూరు(మెట్రో): అనివార్య కారణాల వల్ల సోమవారం ఏలూరు కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు డీఆర్వో వి.విశ్వేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

కదం తొక్కిన ఉపాధ్యాయులు

- వెబ్ కౌన్సెలింగ్‌పై మండిపాటు
- ఏలూరులో డీఈఓ కార్యాలయం ముట్టడి



ఏలూరులో డీఈఓ కార్యాలయం గేట్ వద్ద బైఠాయించి నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు



డీఈఓ కార్యాలయం వద్ద గుమిగూడిన ఉపాధ్యాయులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీల్లో నెలకొన్న సమస్యలను, ముఖ్యంగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలనే డిమాండ్‌తో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరులోని పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని ఉపాధ్యాయులు ముట్టడించారు. డీఈఓ కార్యాలయ గేటు వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 500 మంది ఉపాధ్యాయులు హాజరై నిరసన తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి మద్దతుగా నిలిచారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ వెంటనే జోక్యం చేసుకుని తక్షణమే ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికతో చర్చించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జరిపిన చర్చల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చారని, అయితే ఇందుకు భిన్నంగా ఇప్పుడు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు ఎనేబుల్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది ఉపాధ్యాయులను మోసం చేయడమే అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీదేవి మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్లకు నిర్వహించిన వెబ్ కౌన్సెలింగ్‌లో సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయని, ఎస్జీటీలకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తే దాదాపు 2 వేల పాఠశాలలకు ప్రయారిటీ ఆప్షన్లు ఇచ్చుకోవాలని, ఇది తీవ్ర మానసిక ఒత్తిడితో కూడిన పని అన్నారు. ముట్టడి కార్యక్రమానికి యూటీఎఫ్ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు, రాష్ట్ర బాధ్యులు ఉమ్మడి జిల్లా నుంచి హాజరైన ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. యూటీఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తఫా ఆలీ, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, ఏపీటీఎఫ్ 1938 ప్రధాన కార్యదర్శి జి.మోహన్, పీఆర్‌టీయూ అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, పీఈటీస్ అసోసియేషన్ నాయకులు రమేష్, వైఎస్సార్ టీఏ మోహనరావు, యూటీఎఫ్ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు, ప్రధాన కార్యదర్శి ఏకేవీ రామభద్రం, పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఎస్టీయూ నాయకులు శ్రీనివాస్ వర్మ, ఏపీటీఎఫ్ గౌరవాధ్యక్షుడు సీహెచ్ పట్టాభిరామయ్య తదితరులు హాజరయ్యారు. అనంతరం డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మని కలిసి సమస్యలను తెలియజేశారు.

వెబ్ ఆప్షన్లు అప్రజాస్వామికం



వెబ్ ఆప్షన్ల విధానంతో గతంలో చాలామంది ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారు. ఆన్‌లైన్‌లో కనిపించే రెండు వేలకు పైగా స్థానాలను గుర్తించడం ఉపాధ్యాయులకు కష్టతరమవుతోంది. దీంతో కొందరు 150 కిలోమీటర్లకు పైగా దూరం వెళ్లాల్సి వచ్చింది. మరోసారి ఇలాంటి విధానంతోనే నిర్వహిస్తామనడం అప్రజాస్వామికం. ఉపాధ్యాయుల బదిలీలను మాన్యువల్ విధానంలోనే నిర్వహించాలి. లేకుంటే ఉపాధ్యాయుల ఆగ్రహానికి ప్రభుత్వం గురికావాల్సి వస్తుంది.

– రవికుమార్ రుద్రాక్షి, యూటీఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు

వేటకు సన్నద్ధం

- 6 రోజుల్లో ముగియనున్న వేట నిషేధం గడువు
- 14న అర్ధరాత్రి నుంచి సముద్రంలో వేట
- వేట సామగ్రి సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు
- వరుస విపత్తులతో గతేడాది సవ్యంగా సాగని వేట



నరసాపురం తీరంలో వేట సాగిస్తున్న మత్స్యకారులు (ఫైల్)

నరసాపురం : సముద్రంలో వేట నిషేధ కాలం గడువు ముగియనుంది. మరో ఆరు రోజుల్లో సముద్రంలో వేట ప్రారంభం కానుంది. దీంతో నరసాపురం తీర ప్రాంతంలో వేట సాగించే మత్స్యకారులు వేటకు సమాయత్తమవుతున్నారు. రెండు నెలలుగా వలలు మూలనపెట్టి ఇళ్లకే పరిమితమైన మత్స్యకారులు వేట సామగ్రి సిద్ధం చేసుకుంటున్నారు. వలలు, బోట్లు మరమ్మతులు చేసుకుంటున్నారు. ఈనెల 14న (శనివారం) అర్ధరాత్రి నుంచి మళ్లీ సముద్రంలో వేట ప్రారంభం కానుంది. చేపల పునరుత్పత్తి సీజన్ కావడంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా వేసవిలో సముద్రంలో వేట నిషేధం అమలు చేస్తుంది. ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు ఇది అమలులో ఉంటుంది. ఈ 61 రోజులు మత్స్యకారులు ఖాళీగా ఉంటారు.

గత ప్రభుత్వంలో అండగా..

వేట నిషేధ సమయంలో మత్స్యకారులు ఉపాధి లేక ఆకలితో జీవితాలను గడుపుతుంటారు. 2019–24 కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వేట నిషేధ సాయాన్ని వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం పేరుతో అందించింది. 2014కు ముందు కేవలం 64 మందికి మాత్రమే లబ్ధి అందించగా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లబ్ధిదారుల సంఖ్యను 1,454కు పెంచింది. అలాగే సాయాన్ని రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచింది.

విపత్తులతో 'వల'విల

గతేడాది మత్స్యకారులకు సముద్రం వేట కలిసిరాలేదు. 2024 జూన్‌లో వేట మొదలు పెట్టిన వెంటనే వరుసగా తుపానులు, అల్పపీడనాలతో సముద్రంలోకి వెళ్లిన బోట్లు పట్టుమని ఒకటి, రెండు రోజులు కూడా వేట సాగించకుండా తీరానికి చేరాల్సి వచ్చింది. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాకుండా నష్టాలు చవిచూశారు. దీనికి తోడు ఆ ఏడాదిలో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ వేట నిషేధ సాయం అందించలేదు. దీంతో వేట కార్మికులు అప్పులపాలయ్యారు. నిషేధం అనంతరం రెండు నెలల పాటు సముద్రంలో అపారంగా మత్స్య సంపద దొరుకుతుంది. ప్రకృతి కరుణిస్తే మత్స్యకారులు ఆదాయం గడిస్తారు. ఈ ఏడాదైన ప్రకృతి కరుణించాలని గంగపుత్రులు వేడుకుంటున్నారు.



గోదావరి తీరంలో వలలు బాగు చేసుకుంటున్న మత్స్యకారులు

తీరంలో జోరుగా వేట

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 19 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉన్న నరసాపురంలో రోజూ జోరుగా వేట సాగుతుంది. బంగాళాఖాతానికి సంబంధించి ముఖ్యమైన ప్రాతం కావడం, గోదావరి సముద్రంలో కలిసే ప్రదేశం ఇక్కడే ఉండటంతో ఇక్కడి తీరంలో మత్స్య సంపద అపారంగా దొరుకుతుంది. నెల్లూరు, విశాఖ, కృష్ణా, తూర్పు గోదావరి తదితర జిల్లాలకు చెందిన సుమారు 150 వరకూ మెకనైజ్డ్ బోట్లు ఇక్కడ నిత్యం సముద్రంలో వేట సాగిస్తుంటాయి. ఏడాదికి రూ.300 కోట్లకు పైగా మత్స్యసంపద ఇక్కడ దొరుకుతుంది. ఇక దాదాపు 2 వేల మంది వరకూ పూర్తిగా వేటనే నమ్ముకుని ఇక్కడ బతుకుతున్నారు.

వేట కోసం ఎదురుచూస్తున్నాం



వేట సమయం ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తున్నాం. ఇంకో వారం రోజుల్లో వేట ప్రారంభమవుతుంది. మాకు వేరే పని తెలియదు. ఈ రెండు నెలలు ఖాళీగానే ఉన్నాం. వేట విరామం తర్వాత సముద్రంలో చేపలు బాగా దొరుకుతాయి. చేపలు పైకి బాగా తేలి వలలకు చిక్కుతాయి. మాకు సముద్రంలో ఈనెల సీజన్. కాకపోతే తుపానులు అవీ పట్టకూడదు.

– పెమ్మాడి నాగరాజు, మత్స్యకారుడు, నరసాపురం

సౌకర్యాలు మెరుగుపరచాలి



వేట సాగించే మత్స్యకారులకు ప్రభుత్వాలు సౌకర్యాలు మెరుగుపరచాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బియ్యపుతిప్పలో మేజర్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి రూ.360 కోట్లతో టెండర్లు పిలిచి పనులు చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వంలో హార్బర్ నిర్మాణంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. మత్స్య ఎగుమతులను ప్రోత్సహించాలనే ఆలోచనలో ప్రస్తుత ప్రభుత్వాలు లేకపోవడం దారుణం.

– బర్రి శంకరం, మత్స్యకార నేత

ఈఏపీసెట్‌లో 8,330 మంది అర్హత

భీమవరం: ఏపీఈఏపీసెట్‌లో జిల్లాకు చెందిన 8,330 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఇంజనీరింగ్ ఎంట్రన్స్ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 11,717 మంది దరఖాస్తు చేసుకోగా 6,010 మంది బాలురు, 5,707 మంది బాలికలు ఉన్నారు. వారిలో 5,806 మంది బాలురు, 5,522 మంది బాలికలు పరీక్షకు హాజరుకాగా 4,182 మంది బాలురు, 4,148 మంది బాలికలు అర్హత సాధించారు. అలాగే అగ్రికల్చరల్ పరీక్షకు 4,017 మంది దరఖాస్తు చేసుకోగా 3,712 మంది పరీక్షకు హాజరైతే వారిలో 3,360 మంది అర్హత సాధించారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు 3,409 మంది, అగ్రికల్చరల్ కోర్సుల్లో ప్రవేశాలకు 1,726 మంది అర్హత సాధించారు. ఇంజనీరింగ్ కోర్సుల్లో పాకలపాటి హర్షవర్ధన్ 85, ఏలూరుకి చెందిన అల్లు హేమంత్ 97, అగ్రికల్చరల్ కోర్సుల్లో పెదపాడు మండలం కొక్కిరపాడుకు చెందిన కోసూరి వల్లీ ప్రియ 59, ఏలూరుకు చెందిన యర్రా శోభ రిషిత 109వ ర్యాంకులతో ప్రతిభ కనబర్చారు. ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలకు జిల్లా నుంచి 4,874 మంది దరఖాస్తు చేసుకోగా 4,700 మంది పరీక్షలు రాశారు. వారిలో 1,817 మంది బాలురు, 1,592 మంది బాలికలు అర్హత సాధించారు. అగ్రికల్చరల్ పరీక్షలకు 2,002 మంది దరఖాస్తులు చేసుకోగా 1,899 మంది పరీక్షలు రాశారు. వారిలో 443 మంది బాలురు, 1283 మంది బాలికలు అర్హత సాధించారు.

గానుగ నూనె ధరల ఘాటు



తాడేపల్లిగూడెం: పచ్చళ్ల సీజన్ దాటిపోతున్నా నూనె ధరల సెగ వినియోగదారులను వదలడం లేదు. పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని కేంద్రం తగ్గించినా అమ్మకందారులు మాత్రం సుంకం మేరకు ధరలు తగ్గించడం లేదు. ఇదిలా ఉండగా మార్కెట్‌లో లభించే నూనెల నాణ్యతపై వినియోగదారుల్లో విశ్వాసం సన్నగిల్లడంతో గానుగ నూనె వైపు మొగ్గుచూపుతున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు శీతలీకరణ పద్ధతి అంటూ ధరలకు టోకరా వేస్తున్నారు. దాదాపు కిలో రూ.400 వరకు విక్రయిస్తున్నారు. అయితే గానుగ నూనెలో కూడా తేడాలు గమనించని విధంగా కల్తీలు జరుగుతున్నాయి. అలాగే నూనె కొలతలకు ప్రామాణికాలు లేకుండా పోయాయి. గతంలో కిలో నూనె ప్యాకెట్లు ఉండగా తర్వాత లీటరు (910 గ్రాములు) ప్యాకెట్లు వచ్చాయి. కచ్చితత్వ కొలతలకు తిలోదకాలిచ్చిన నేపథ్యంలో 800 గ్రాముల నుంచి 695 గ్రాముల వరకు నూనె ప్యాకెట్లు మార్కెట్‌లోకి వస్తున్నాయి.

స్వల్పంగా తగ్గించి..

వంట నూనెల దిగుమతి సుంకాన్ని కేంద్రం 27 నుంచి 10 శాతానికి తగ్గించడంతో నూనెల ధరలు మార్కెట్‌లో స్వల్పంగా తగ్గాయి. లీటర్ పామాయిల్ రూ.130 నుంచి రూ.100కి, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.160 నుంచి రూ.143కు, రైస్‌బ్రాన్ ఆయిల్ రూ.150 నుంచి రూ.142కు, వేరుశనగ నూనె రూ.160 నుంచి రూ.150కు వచ్చింది. అయితే కొందరు వ్యాపారులు మాత్రం ధరలు తగ్గించకుండా పాత ధరలనే కొనసాగిస్తున్నారు. గానుగ నూనె పేరుతో నాణ్యత అంటూ కిలో రూ.360 నుంచి రూ.380కు విక్రయిస్తూ వినియోగదారులకు టోపీ పెడుతున్నారు. తూనికల కొలతల శాఖ, అధికారులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు మార్కెట్‌లో నూనె శాంపిల్స్ తీసుకుని వినియోగదారులు మోసపోకుండా కట్టడి చేయాల్సి ఉంది.

యోగాంధ్రలో భాగం కండి

భీమవరం(ప్రకాశంచౌక్): యోగాంధ్రలో భాగంగా స్థానిక అల్లూరి సీతారామరాజు స్మృతి వనం వద్ద సోమవారం నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా అవగాహన ర్యాలీలు నిర్వహించాలని ఆదేశించారు.

రూ.69.30 లక్షల ఆన్‌లైన్ మోసం

ఏలూరు టౌన్: తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయంటూ ఒక మహిళను నమ్మించి ఆన్‌లైన్‌లో భారీగా నగదును కాజేశారు. ఏలూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు రూరల్ వెంకటాపురం పంచాయతీ గ్రీన్‌సిటీ ప్రాంతానికి చెందిన మెయిదా కృష్ణభవానీ (30) గతంలో ఒక ప్రైవేటు స్కూల్‌లో పనిచేశారు. ఆమె సెల్‌ఫోన్ వాట్సాప్‌కు గతనెల 19న అమాన్సా పీటీ ప్రైవేట్ లిమిటెడ్ యాప్ నుంచి ఇన్వెస్ట్‌మెంట్ లింకు వచ్చింది. లింకును ఓపెన్ చేసిన కృష్ణభవానీ తనపేరుతో అకౌంట్ రిజిస్టర్ చేసుకున్నారు. మరో నంబర్ నుంచి అదే యాప్ డౌన్‌లోడ్ చేసి చాటింగ్ చేశారు. ఈ కంపెనీలో పెట్టుబడులు పెట్టడం ద్వారా లాభాలు ఆర్జించినట్లు చాటింగ్‌లో పలువురు చెప్పగా ఆమె నమ్మారు. దీంతో ఆమె పలు దఫాలుగా రూ.69.30 లక్షల పలు ఖాతాలకు చెల్లించారు. అయితే ఎలాంటి లాభాలు లేకపోవడంతో తాను మోసపోయినట్టు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. ఆదివారం ఏలూరు రూరల్ ఎస్సై సీహెచ్‌కే దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కక్షతోనే గోడ కూల్చివేత

- ఎంపీటీసీ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే కొఠారు పరామర్శ
- అధైర్యపడొద్దని.. అండగా ఉంటామని భరోసా



చల్ల చింతలపూడిలో ఎంపీటీసీ ఇంటి ప్రహరీ గోడను కూల్చివేస్తున్న దృశ్యం

దెందులూరు : మండలంలోని చల్ల చింతలపూడిలో ఎంపీటీసీ సభ్యురాలు సింహాద్రి పద్మావతి, మాజీ సర్పంచ్ సింహాద్రి శ్రీమన్నారాయణ ఇంటి ప్రహరీ గోడను టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరినందుకే రాజకీయ కక్ష ధోరణితోనే కూల్చివేశారని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బాయ్యచౌదరి విమర్శించారు. ఆదివారం ఎంపీటీసీ సింహాద్రి పద్మావతి, మాజీ సర్పంచ్ సింహాద్రి శ్రీమన్నారాయణలను కొఠారు ఫోన్‌లో పరామర్శించారు. సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని సూచించారు. ఇటువంటి సంఘటనలు ఎంత మాత్రం సరైనవి కాదని, గోడ కూల్చివేతపై ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఆయన చెప్పారు. ఈ విషయంలో బాధితులకు అండగా ఉండి న్యాయపోరాటం చేస్తామన్నారు. కూల్చివేతలో విధులు నిర్వహించినవారు కచ్చితంగా మూల్యం చెల్లించుకోక తప్పదని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరిగితే పార్టీ చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు.

వీఆర్వో వివరణ

గోడ కూల్చివేతపై వీఆర్వో సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా.. చల్ల చింతలపూడి గ్రామంలో రోడ్లకు రెండు వైపులా మూడు అడుగుల మేరకు తొలగించాలని గ్రామ పంచాయతీ తీర్మానం చేసిందని చెప్పారు. పంచాయతీ తీర్మానం మేరకు ప్రహరీ గోడ తొలగించినట్టు చెప్పారు.

సౌందర్యలహరి శ్లోకాల పోటీలు



పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో సనాతన భక్తి మండలి సభ్యురాలు నంబూరి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆది శంకరాచార్య విరచితం సౌందర్యలహరి శ్లోకాల పోటీలు ఆదివారం నిర్వహించారు. 45 రోజులుగా వేసవి సెలవుల్లో 100 శ్లోకాలపై సుమారు 50 మంది చిన్నారులకు శిక్షణ ఇచ్చామని భాగ్యలక్ష్మి తెలిపారు. శ్లోకాలతో పాటు సనాతన ధర్మం, శాస్త్ర విజ్ఞానం, రుషులు, మునుల గొప్పతనం వివరించామన్నారు. శిక్షణ తరగతులకు సహకరించిన ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శ్లోకాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

10 గంటల పని విధానంపై ఆగ్రహం



ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఏలూరు టౌన్: కార్మికుల హక్కులను కాలరాస్తూ 10 గంటల పని విధానాన్ని అమలు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలనీ, రాత్రి వేళల్లో మహిళలతో పని చేయించవద్దని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏలూరు ఆర్ఆర్‌పేట నగరపాలక పార్కు వద్ద ఆదివారం ఆందోళన చేపట్టారు. రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయాల కాపీలను ఏఐటీయూసీ నాయకులు దగ్ధం చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఏలూరు ఏరియా అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి మన్నవ యామిని మాట్లాడుతూ 10 గంటల పని విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించటం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులను అనుకూలంగా ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, జిల్లా నాయకులు పి.కిషోర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈఏపీసెట్ ఫలితాల్లో శశి వైజాగ్‌కు ర్యాంకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో తమ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ విభాగంలో పాకలపాటి హర్షవర్ధన్ రాష్ట్ర స్థాయిలో 85వ ర్యాంకు, డి.స్టీఫెన్ 155వ ర్యాంకుతో పాటు 500 లోపు 14 మంది, 1000 లోపు 26 మంది, 2 వేల లోపు 48 మంది, 5 వేల లోపు 111 మంది ర్యాంకులు సాధించారని వివరించారు. బైపీసీ విభాగంలో కె.జస్వంత్ 27వ ర్యాంకు, ఎల్.రేష్మ 66వ ర్యాంకు, ఆర్.సాయి కుమారి 144వ ర్యాంకు, ఆర్.ప్రతిభ 203వ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ మేకా క్రాంతిసుధ ప్రత్యేకంగా అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నరసాపురం: పట్టణంలోని 216 జాతీయ రహదారి ఆంజనేయస్వామి గుడి వద్ద ఆదివారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక 31వ వార్డు ఓఎన్జీసీ కాలనీకి చెందిన కొండేటి జాన్‌పాల్(53) అక్కడికక్కడే మృతి చెందాడు. నరసాపురం వైపు వస్తున్న లారీ జాన్‌పాల్‌ను ఢీట్టడంతో ప్రమాదం జరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టౌన్ సీఐ బి.యాదగిరి చెప్పారు.

రైలు ఢీకొని మరొకరు..

వీరవాసరం: పెర్కిపాలెం రైల్వే గేటు సమీపంలో రైలు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. భీమవరం రైల్వే ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం.. పెర్కిపాలెం గ్రామానికి చెందిన కందుకూరి ఏడుకొండలు ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్తూ రైల్వే పట్టాలు దాటుతుండగా, వెనుకగా వచ్చిన అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండి: భార్యను భయపెట్టేందుకు ప్రయత్నించిన భర్త చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం ఉండి మండలం చినపుల్లేరు గ్రామానికి చెందిన ఇందుకూరి కృష్ణంరాజు(43) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. శనివారం చెట్లు కొడుతుండగా కత్తి జారి కాళ్లపై పడింది. ఇంటికి వెళ్ళిన అతనిని భార్య కనీసం ఇంజెక్షన్ ఎందుకు చేయించుకోలేదని నిలదీయడంతో భార్యను భయపెట్టేందుకు ఇంట్లో ఉన్న గ్యాస్ ట్యాబ్లెట్లను మింగేశాడు. అనంతరం అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

నేటి నుంచి వేణుగోపాల స్వామి వార్షికోత్సవాలు

చింతలపూడి: మండలంలో యర్రగుంటపల్లిలో సంతాన వేణుగోపాలస్వామి వార్షిక మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, శ్రీ షిరిడీ సాయిబాబా ,అయ్యప్ప స్వామి వైభవంగా విశేష పూజలు ప్రారంభమవుతాయి. ముందుగా గోపూజ, గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. 1893లో చంద్రగిరి కాశీ అనే భక్తుడికి స్వామి వారు స్వప్నంలో కనిపించి యర్రగుంటపల్లి గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయం నిర్మించాలని ఆదేశించడంతో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు చెబుతారు. ఉత్సవాల చివరి రోజుల వేలాది మందికి అన్నదానం చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త చంద్రగిరి శేష కిరణ్ తెలిపారు.

సంక్షోభంలో మామిడి రైతులు

ధర లేని బంగినపల్లి మామిడి

నూజివీడు: ఈ ఏడాది బంగినపల్లి మామిడి రైతులను, వ్యాపారులను సంక్షోభంలోకి నెట్టేసింది. ప్రతికూల వాతావరణం, నల్లతామర కారణంగా బంగినపల్లి దిగుబడి దారుణంగా తగ్గిపోగా ఉన్న కాస్త కాయలకు మార్కెట్లో ధర లేకుండా పోయింది. దీనికి తోడు సిండికేట్ మాయాజాలంతో మామిడి ధరలు పతనమయ్యాయి. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాక రైతులు నష్టాలపాలయ్యారు. జిల్లాలో మామిడితోటలు దాదాపు 40 వేల ఎకరాల్లో సాగవుతుండగా ఒక్క నూజివీడు నియోజకవర్గంలోనే 35 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. నాలుగు మండలాల్లోని రైతులకు ప్రధాన ఆదాయ వనరు మామిడే. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలు నష్టపోయినా, మామిడి ఆదుకుంటుందనే ధీమాతో రైతులు మామిడిపై నమ్మకం పెట్టుకుంటారు. బంగినపల్లి రకం తోటలు దాదాపు 25 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతం నుంచి మామిడి కాయలను స్థానికంగా ఉన్న మార్కెట్‌లతో పాటు నున్న, హైదరాబాద్‌లలోని మార్కెట్, ముంబాయి, ఇండోర్, అహ్మదాబాద్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు.

దిగజారిన ధర

మామిడి ధర కూడా దిగజారుతూ వచ్చిందే తప్ప ఈ ఏడాది పెరిగిన దాఖలాలు లేవు. సీజన్ ప్రారంభమైన మార్చి మొదటి వారంలో బంగినపల్లి టన్ను ముంబాయి మార్కెట్లో రూ.80 వేల నుంచి రూ.90 వేల ధర పలకగా స్థానికంగా రూ.40 వేలు పలికింది. రానురాను రూ.30 వేలకు, రూ.20 వేలకు తగ్గుతూ ప్రస్తుతం కాయ బాగుంటే రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ధర లభిస్తోంది. ఏ మాత్రం నాణ్యత లేకపోయినా టన్ను కేవలం రూ.10 వేలకే లభిస్తోందని రైతులు వాపోతున్నారు. మామిడికి ఇంత దారుణమైన పరిస్థితి గత 25 ఏళ్లలో ఎన్నడూ చూడలేదని పేర్కొంటున్నారు.



బంగినపల్లి మామిడి కాయలు

నున్న, హైదరబాద్‌లలో ఉన్న మామిడి మార్కెట్‌కు కాయలను కొనుగోలు చేయడానికి వచ్చే ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన సేట్‌లు సిండికేట్ కావడం వల్ల ధరలు పెరగడం లేదని రైతుల నుంచి వ్యక్తమవుతున్న అభిప్రాయం. రైతులకు నష్టం చేకూరుస్తున్న సిండికేట్‌ను నిలువరించేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడం, అసలు మామిడి రైతులను ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలే లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మామిడిపై రైతులు పెట్టుకున్న ఆశలు రాలిపోయాయి.

రూ.60 వేల నష్టం వచ్చింది



నాలుగు ఎకరాల మామిడి తోట ఉంది. పెట్టుబడి రూ.1.70 లక్షలైంది. బంగినపల్లి రకం కాయలు కోసి మార్కెట్‌లో విక్రయిస్తే కోతకూలి, కిరాయి పోను రూ.1.10 లక్షలు మాత్రమే వచ్చాయి. దీంతో రూ.60 వేల నష్టం వాటిల్లింది. ఈ ఏడాది కాపు తక్కువగా ఉన్నప్పటికీ ఆశించిన ధర లేదు.

–నీలపాల కోటేశ్వరరావు, మామిడి రైతు, యనమదల, నూజివీడు మండలం

అకాల వర్షాలు దెబ్బతీశాయి

ఈ ఏడాది మే నెల అంతా కురిసిన అకాల వర్షాల వల్ల బంగినపల్లి మామిడి కాయలు నాణ్యత కోల్పోవడంతో ధర పతనమైంది. కొన్ని రోజులైతే మామిడి కాయలను ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో కోతలను సైతం నిలిపివేశారు. వర్షాలు పడిన దగ్గర నుంచి కాయలను పురుగులు ఆశించడంతో కొనేవారే లేకుండా పోయారు. ఇలా ప్రతికూల వాతావరణంతో పాటు పలు కారణాల వల్ల ఈ ఏడాది మామిడి రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు



నాగబంధాలకు పూజలు చేస్తున్న అర్చకులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకున్నారు. పాల పొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద స్వామి మూర్తులను ప్రతిష్ఠించేందుకు అర్చకులతో పూజలు చేయించి ప్రతిష్ఠ తంతు నిర్వహించారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద ఏర్పాట్లు చేశారు. స్వామిని దర్శించుకునే భక్తులు అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొంటే మేలు జరుగుతుందనే విశ్వాసం ఉంది.

ఖర్చంతా గ్రంథ పాలకులదే

వేసవి తరగతుల నిర్వహణ బిల్లులు చెల్లించని ప్రభుత్వం

దెందులూరు: వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానం పెంపొందించి, ఆటలు పాటలు ద్వారా మానసిక, శారీరక దృఢత్వం పెంచేందుకు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నెలరోజుల పాటు నిర్వహించారు. పుస్తకాలు, పత్రికలు చదివించడం, నీతి కథలు, ప్రముఖుల జీవితాలు వివరించడం, వ్యాసరచన, డ్రాయింగ్, బొమ్మల తయారీ, చెస్, కబడ్డీ, కోకో పోటీలను నెలరోజుల పాటు గ్రంథాలయంలో గ్రంథ పాలకులు, రిసోర్స్ పర్సన్లు నిర్వహించారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వివిధ విభాగాల్లో శిక్షణ ఇచ్చారు. ప్రతిరోజు బిస్కెట్లు, మజ్జిగ ఏదోకటి ఇచ్చారు. ప్రతి గ్రంథాలయంలో చదువరి సంఖ్యను బట్టి 15 మంది నుంచి 20 మంది కొన్ని గ్రంథాలయాల్లో 20 నుంచి 30 వరకు విద్యార్థులు శిక్షణ పొందారు. రోజుకు బిస్కెట్లు, మజ్జిగ నిమిత్తం రూ.150 నుంచి 200 వరకు ఖర్చులయ్యాయి. శిక్షణ అనంతరం వివిధ విభాగాల్లో విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు, బొకేలు, చాక్లెట్లు ఇచ్చారు. నెల మొత్తం మీద ఒక్కో గ్రంథాలయానికి అన్ని ఖర్చులకు రూ.10 వేల నుంచి రూ.14 వేల వరకు పెట్టుబడి పెట్టారు.



భీమడోలు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల దృశ్యం (ఫైల్)

జిల్లా గ్రంథాలయ సంస్థ, ఒక రూపాయి కూడా గ్రంథాలయాలకు నిర్వహణ ఖర్చులు మంజూరు చేయలేదు. చాలీచాలని తక్కువ జీతాలతో కాలం నెట్టుకు వస్తుంటే వేసవి శిక్షణ తరగతులు పేరిట నెలకు రూ.10 వేల నుంచి 14 వేలు తాము పెట్టుబడి పెట్టడం తలకు మించిన భారంగా తయారైందని అనేకమంది గ్రంథ పాలకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖర్చుతో కూడుకున్న కార్యక్రమానికి నిర్వహణ నిమిత్తం కూడా డబ్బులు మంజూరు చేయకపోతే తాము ఎలా పెట్టుబడి పెడతామని తక్కువ జీతాలతో చాలా ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు.

తీరని ఉద్యోగుల సమస్యలు

కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయింది. ఈ సంవత్సర కాలంలో గ్రంథాలయ ఉద్యోగుల పీఆర్సీ, డీఏ ఊసెత్తలేదు. డీఎస్సీ ఇతర పోటీ పరీక్షలకు గ్రంథాలయాల్లో ఇదివరకు ఉన్న జీకే పుస్తకాలే తప్ప నూతనంగా కొన్న పుస్తకాలు ఏవీ లేవు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా కొత్త పుస్తకాలు కొనాల్సిన అవసరం ఉంది. శాఖ పరంగా పీఆర్సీ, డీఏ సమస్యలు పరిష్కరించకపోగా డబ్బుతో కూడుకున్న కార్యక్రమాలు తమపై రుద్దితే ఎలాగని గ్రంథాలయ ఉద్యోగుల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల పదోన్నతులపై కూడా చర్యలు లేవు. జిల్లాలో అనేకచోట్ల నేటికీ అద్దె భవనాల్లోనే గ్రంథాలయాలు నిర్వహిస్తున్నారు. ఇన్ని సమస్యలతో గ్రంథాలయాలు సతమతమవుతున్నాయి. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులకు పెట్టుబడి పెట్టామని, ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఇస్తే చెల్లిస్తాం

వేసవి విజ్ఞానశిక్షణ తరగతులు నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదని, నిధులు మంజూరై వస్తే జమ చేస్తామని ఏలూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్ బాబు అన్నారు.

కోకో గింజల చోరీ కేసులో నలుగురి అరెస్టు

జంగారెడ్డిగూడెం: కోకో గింజల చోరీ కేసుల్లో నలుగురిని అరెస్టు చేసినట్లు జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం, లక్కవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇటీవల కోకో గింజల చోరీ జరిగింది. దొంగిలించిన రూ.8 లక్షలు విలువైన 2 వేల కేజీల కోకో గింజలు అమ్మేందుకు ప్రయత్నించిన క్రమంలో, దాడి చేసి జంగారెడ్డిగూడెం మండలం చక్రదేవరపల్లికి చెందిన కంకిపాటి కీర్తిరాజు, మానికల మంగరాజు, దొప్పసాని వెంకన్నబాబు, పుట్లగట్లగూడెంకు చెందిన కటారి సుబ్రహ్మణ్యంను అరెస్టు చేశామన్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిపారు. వీరిలో కంకిపాటి కీర్తిరాజు పగలు మేకలు కాస్తూ పొలాల్లో ఉన్న కోకో గింజలు ఆరబెట్టిన ప్రదేశాలు గమనించి, బృందంలోని మరో ఐదుగురికి చెబుతాడు. ఆటోలో రహస్య ప్రదేశానికి తరలించేవారు. వీలుచూసుకుని అమ్మేవారు. వీరిపై జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2 కేసులు, లక్కవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2 కేసులు, టి.నరసాపురం పీఎస్ పరిధిలో ఒక కేసు నమోదైంది. ద్వారకాతిరుమల, తడికలపూడి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో సైతం కేసులు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకోవడం పాటు, చోరీకి వినియోగించిన ఆటోను సీజ్ చేసినట్లు చెప్పారు. కేసును ఛేదించిన ఎస్సై జబీర్, ఏఎస్సై సంపత్‌కుమార్, పీసీలు రమేష్, బి.రాజశేఖర్‌లకు రివార్డు కోసం ఎస్పీకి సిఫార్సు చేస్తున్నట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ యు.రవిచంద్ర

హాకీ పోటీల విజేతగా అనంతపురం

భీమవరం: క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవచ్చని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ అన్నారు. భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలో మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లా బాలికల హాకీ పోటీల ముగింపు సందర్భంగా ఆదివారం విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో 16 జట్లు పాల్గొనగా ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం, అన్నమయ్య జిల్లాల జట్లు తలపడగా అనంతపురం విజయం సాధించింది. కార్యక్రమంలో భీమవరం మండల పరిషత్ అధ్యక్షుడు పేరిచర్ల విజయ నరసింహరాజు, హాకీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గంధం హర్షవర్ధన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కలిదిండి ఆనందరాజు, కేవీస్ భరత్ తదితరులు పాల్గొన్నారు.



హాకీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

● ఎండకు విలవిల్లాడుతున్న భక్తజనం

భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. దాంతో ఎండ తీవ్రత రోజురోజుకు పెరిగిపోతోంది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలలో ఎండ ప్రచండానికి భక్తులు అల్లాడుతున్నారు. మొక్కుబడులు తీర్చుకుంటున్న భక్తులు ఎండ నుంచి రక్షణ పొందేందుకు తుండ్లు కప్పుకుని తిరుగుతున్నారు. మహిళలు చున్నీలను తలకు చుట్టుకుంటున్నారు. కాస్త నీడ కనిపిస్తే చాలు భక్తులు అక్కడికి చేరిపోతున్నారు. చల్లదనం కోసం వెంపర్లాడుతున్నారు.

ద్వారకాతిరుమల



తలపై టవల్ కప్పుకుని ఆలయంలోకి..



చీర చెంగు కప్పుకుని ..



శ్రీవారి కొండపై టవల్ నీడలో పిల్లలతో వెళ్తున్న భక్తుడు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

వీరవాసరం: మండలంలోని అండలూరు గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బొండాడ గ్రామానికి చెందిన మహిళ మృతిచెందింది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలు అండలూరు చర్చి టర్నింగ్ తిరుగుతుండగా లారీ ఢీకొనడంతో చిట్టజల్లి సత్యవతి (30) అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. భర్తకు స్వల్ప గాయాలయ్యాయి. వాడపల్లి దర్శనానికి వెళ్లి వస్తుండగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అండలూరు చర్చి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ఉన్న రోడ్డు ప్రయాణికులతో రద్దీగా మారడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మృతదేహం వద్ద పంచనామా నిర్వహిస్తున్న దృశ్యం

వానాకాలంలో వ్యాధుల ముప్పు

- ● సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం
- ● దోమల నివారణకు ముందస్తు చర్యలు

బుట్టాయగూడెం: వర్షాకాలం వచ్చేసింది. మరికొద్ది రోజుల్లో వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఈ నేపథ్యంలో వాతావరణంలో మార్పులతో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని లేకుంటే పలు రోగాల బారిన పడే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా విస్తారంగా వర్షాలు కురిసిన సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. నీటి కలుషితం ద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, మురికి నీటి నిల్వలతో దోమలు కూడా వృద్ధి చెందుతాయని వైద్యాధికారులు అంటున్నారు. వర్షాకాలంలో గిరిజన ప్రాంతంలో ఎక్కువగా వాతావరణ మార్పుల వల్ల మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, డయేరియా, కామెర్లు వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని అధికారులు చెబుతున్నారు. ఏ చిన్న లక్షణం కనిపించినా వెంటనే అందుబాటులో ఉన్న ప్రభుత్వాస్పత్రులకు సూచిస్తున్నారు.

జిల్లాలో 153 మలేరియా సమస్యాత్మక గ్రామాలు

జిల్లాలోని గిరిజన మండలాలైన పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల పరిధిలో సుమారు 153 మలేరియా వ్యాపించే సమస్యాత్మక గ్రామాలుగా అధికారులు గుర్తించారు. గతంలో 143 సమస్యాత్మక గ్రామాలు ఉండగా ఈ సంఖ్య పెరిగింది. ఆయా గ్రామాల్లో ప్రస్తుతం మొదటి విడత మలేరియా స్ప్రేయింగ్ పనులు మే 1 నుంచి ప్రారంభించారు. ఇందుకోసం 53 టన్నుల మలాథియన్ స్ప్రేయింగ్ మందు డబ్బాలు సిద్ధం చేశారు. గ్రామాల్లో మొదటి విడత పనులు పూర్తయినట్లు అధికారులు చెప్పారు. జూన్ 15వ తేదీ నుంచి 2వ విడత మలాథియన్ స్ప్రేయింగ్ పనులకు ఏర్పాట్లు చేస్తున్నారు.



మలేరియాకు కారణమయ్యే దోమ

జిల్లాలో మలేరియా సమస్యాత్మక గ్రామాలు– 153
పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో –117 గ్రామాలు
విలీన మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరులో – 36 గ్రామాలు
మొదటి విడత స్ప్రేయింగ్ పనులకు వచ్చిన మలాథియన్ – 53 టన్నులు

మలేరియా జ్వరం

ఎనాఫిలస్ దోమ కుట్టడం ద్వారా ఈ జ్వరం వస్తుంది. వైవాక్స్ మలేరియా, ఫాల్స్ ఫారమ్ మలేరియా అనే రెండు రకాలు ఉన్నాయి. ఇందులో రెండో రకం అత్యంత ప్రమాదకరమైంది. జ్వరం వచ్చినప్పుడు టెస్ట్‌లు చేయించుకుని సకాలంలో చికిత్స చేయించుకోకపోతే రోగి చనిపోయే ప్రమాదం ఉంది. తీవ్రమైన జ్వరం, రోజు విడిచి రోజు జ్వరం, తీవ్రమైన తలనొప్పి ఉంటే అవి మలేరియా లక్షణాలు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం. మురికినీరు నిల్వలేకుండా చూసుకోవడం. దోమల నివారణకు చర్యలు తీసుకోవడం వంటి పనులు చేయాలి.



మొదటి విడతలో జరుగుతున్న మలాథియన్ స్ప్రేయింగ్ పనులు

టైఫాయిడ్

కలుషిత నీటిని తాగడం వల్ల, బహిరంగ మలవిసర్జన వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. జ్వరం త్వరగా తగ్గకపోవడం, ఒంటి నొప్పులు, తలనొప్పి, కడుపులో అల్సర్‌ను వ్యాధి లక్షణాలుగా గుర్తించాలి. సురక్షిత నీటిని తాగడం, జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకుని వైద్యం పొందడం ద్వారా నయం కావచ్చు.

డయేరియా

కలుషిత నీరు తాగడం, కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా వస్తుంది. ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాప్తి చెందుతుంది. నిరంతరాయంగా విరోచనాలు, వాంతులు కావడం ఈ వ్యాధి లక్షణాలు. డయేరియా నివారణకు వైద్యులు ఫ్లూయిడ్స్ ఎక్కిస్తారు. సురక్షిత, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పులుపు, కారం ఉండే ఆహారాన్ని తగ్గించడం, ఫాస్ట్ ఫుడ్ వంటివి తినకపోవడం ఉత్తమమని వైద్యులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కలుషిత నీటిని తాగడం వల్ల వ్యాధులు ప్రబరిల్లే అవకాశం ఉంది. ఎక్కడడపడితే అక్కడ నీరు తాగకూడదు. జ్వరం వస్తే అందుబాటులో ఉన్న ఆస్పత్రికి వెళ్ళి రక్త పరీక్షలు చేయించుకుని వ్యాధిని బట్టి వైద్యం పొందాలి. దోమతెరలు వాడటం మంచిది.

ఎస్ఎస్ఎస్ ప్రసాద్, మలేరియా అధికారి, కేఆర్‌పురం, బుట్టాయగూడెం మండలం

మొదటి స్ప్రేయింగ్ పనులు పూర్తి



మలేరియా సమస్యాత్మక గ్రామాల్లో మొదటివిడత స్ప్రేయింగ్ పనులు పూర్తయ్యాయి. ఉన్నతాధికారులు పర్యవేక్షణలో పనులు చేస్తున్నాం. జూన్ 15 నుంచి రెండో విడత స్ప్రేయింగ్ పనులు జరుగుతాయి. ప్రజలు పనులకు పూర్తి సహకారం అందించాలి.

పి. పెద్దిరాజు, సబ్ యూనిట్ ఆఫీసర్, బుట్టాయగూడెం

క్లుప్తంగా

వృద్ధులకు ఇంటింటికీ వైద్యం



వృద్ధుడి ఇంటికెళ్లి వైద్యసేవలందిస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ ఉచిత వైద్యం కార్యక్రమంలో భాగంగా సీనియర్ వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య వృద్ధులకు వైద్య సేవలు అందించారు. తణుకు, ఉండ్రాజవరం ప్రాంతాల్లో ప్రత్యేక వాహనంలో పర్యటించి ఐదుగురు వృద్ధులకు వైద్యం చేశారు. సభ్యులు కె.రామమోహనరావు సౌజన్యంతో ఉచితంగా మందులు అందచేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఉచిత వైద్య సేవలు అవసరమైన వారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గోగులమ్మకు విశేష పూజలు



గోగులమ్మ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక కడకట్ల 32వ వార్డులో వేంచేసి యున్న గోగులమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు నిర్వహించారు. అమ్మవారికి పుట్టింటి వారు, అత్తింటి వారు నైవేద్యాలు సమర్పించారు. రాత్రి పూరి గుడిసె (పుట్టిల్లు) నుంచి ఊరేగింపుగా ప్రధాన ఆలయం (అత్తిల్లు)కు అమ్మవారిని చేర్చారు. సేవా సమితి కమిటీ నిర్వాహకులు రామిశెట్టి సురేష్ పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ స్పిరిట్ అధ్యక్షుడిగా భాస్కర్



పెదప్రోలు భాస్కర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ స్పిరిట్ అధ్యక్షుడిగా విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు పెదప్రోలు భాస్కర్ 2025–26 సంవత్సరానికి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా రంజిత్, కోశాధికారిగా ఏవీఎస్ రమేష్‌కుమార్ ఎంపికయ్యారు. వీరిని లయన్స్ క్లబ్ సభ్యులు, తదితరులు అభినందించారు.

మాజీ మునసబు సతీమణి ప్రమీల మృతికి కారుమూరి సంతాపం



పెనుమర్తి ప్రమీల అలివేలు మంగతాయారు

తణుకు అర్బన్: మండలంలోని వేల్పూరు గ్రామ మాజీ మునసబు పెనుమర్తి వసంతరాయుడు సతీమణి ప్రమీల అలివేలు మంగతాయారు (86) మృతికి మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. ఇటీవల మరణించిన ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు పెనుమర్తి వెంకటరామన్న ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ తణుకు మండల అధ్యక్షుడిగా పార్టీకి సేవలందిస్తున్నారు. వెంకటరామన్నతో మాజీమంత్రి కారుమూరి ఫోన్‌లో మాట్లాడి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ(మీ కోసం) కార్యక్రమం నిర్వహిస్తున్న నరసాపురం ఆర్డీఓ దాసి రాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలు నుంచి కార్యక్రమంలో ప్రారంభం అవుతుందని వివరించారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులను అందించాలని కోరారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు



యర్రంశెట్టివారిపాలెంలో వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని యర్రంశెట్టివారిపాలెంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక కల్యాణ మహోత్సవాల ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన యర్రంశెట్టి శ్రీనివాసరావు, యర్రంశెట్టి భార్గవ దంపతులు ఆలయ పూజారి సూర్య కిరణ్ బ్రహ్మత్వంలో కల్యాణం, చక్ర స్నానం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి భేష్



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

- అభివృద్ధికి నిదర్శనం వైఎస్ జగన్
- గ్రామాల్లో సేవలకు భవన నిర్మాణాలు
- కోట్లాది రూపాయలు వెచ్చించి పూర్తి చేసిన వైనం
- కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి తిరోగమనం
- నియోజకవర్గంలో 39 సచివాలయాలు, 31 ఆర్‌బీకేలు, 9 విలేజ్ క్లినిక్ భవనాల నిర్మాణం
- నేటి కూటమి ప్రభుత్వం ఏడాదిలో ఒక్కటంటే ఒక్కటీ లేని నిర్మాణం

తణుకు అర్బన్: గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ప్రజలకు సత్వర సేవలందించాలనే సదుద్దేశ్యంతో గత వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు చేసిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్, అర్బన్ హెల్త్ సెంటర్లు విరాజిల్లుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండలంలోనూ ఆయా గ్రామాల్లో అవసరమైన భవనాలను నిర్మాణాలు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆ భవనాలకు సంబంధించి ఉద్యోగులు, సిబ్బందిని రిక్రూట్ చేసి వాటి సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజానీకం మండల హెడ్‌క్వార్టర్‌లోని కార్యాలయాలకు వెళ్లనవసరం లేకుండానే స్థానికంగా అందుబాటులోకి తీసుకొచ్చిన కేంద్రాల ద్వారా తమ సమస్యలు పరిష్కరించుకున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ఇంతటి అభివృద్ధి చేయగా నేటి కూటమి ప్రభుత్వ హయాంలో ఒక్కటంటే ఒక్కటీ కూడా నిర్మాణాలు చేయలేదంటూ ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

నిర్వీర్యం దిశగా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను నిర్వీర్యంచేసే దిశగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికే సచివాలయాలద్వారా ప్రజలకు నేరుగా సేవలందించే వలంటీరు వ్యవస్థను కూటమి ప్రభుత్వం తొలగించగా ఉన్న సచివాలయ వ్యవస్థను సైతం ఉంచుతుందో ఊడగొడుతుందో అనే అనుమానాలు వ్యక్తమయ్యేలా పరిపాలన సాగిస్తుందంటూ ఉద్యోగులు సైతం గగ్గోలు పెడుతున్నారు.

ప్రజా సౌకర్యార్థం కోట్లాది రూపాయల నిధులు

ప్రజలకు మేలు కరమైన సత్వర సేవలందించే క్రమంలో గత జగన్ ప్రభుత్వంలో నిర్మాణాలు చేసిన భవనాలకు అప్పట్లో కోట్లాది రూపాయల నిధులు కేటాయించారు. ఆ భవనాలన్నీ నేడు కళ్లకు కట్టినట్లుగా అభివృద్ధి అంటే ఏంటో నిరూపించే దిశగా కనిపిస్తున్నాయి. ఒక్కో సచివాలయ భవన నిర్మాణం కోసం రూ.40 లక్షలు, ఆర్‌బీకేకు రూ.22 లక్షలు, హెల్త్ క్లినిక్‌కు రూ.25 లక్షలు మంజూరు చేశారు. అలా తణుకు నియోజకవర్గంలో 50 సచివాలయ భవనాలు మంజూరు చేయగా 39 పూర్తి చేశారు. ఆర్‌బీకేలు 49 మంజూరు చేయగా 31 పూర్తి చేశారు. హెల్త్ క్లినిక్‌లు 32 మంజూరు చేయగా 9 పూర్తి చేశారు. మిగిలినవి అసంపూర్తిగా ఉండగా వాటి నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కాలంలో ముందుకు రాలేదు.

అభివృద్ధి ఏమిటో చూపించారు



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్, రెవెన్యూ, రైతాంగ సమస్యలను స్థానికంగానే పరిష్కరించే విధంగా ప్రతి గ్రామంలోనూ సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ క్లినిక్‌లకు శ్రీకారం చుట్టి వాటి నిర్వహణకు నూతనంగా భవనాలను నిర్మించారు. దీంతో గ్రామాల్లోని ప్రజానీకం మండల హెడ్‌క్వార్టర్‌లోని కార్యాలయాలకు వెళ్లనవసరం లేకుండా ఇంటి ముందుకే సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. వైఎస్ జగన్ హయాంలో చేసిన అభివృద్ధి సంక్షేమ రూపంలో ప్రజలకు నేరుగా అందిన లబ్ధిలో కనిపిస్తుందని ప్రజలు చెబుతున్నారు.

– ఫణీంద్ర కుమార్ వీరమల్లు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు, తణుకు

మానవత నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

తణుకు అర్బన్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తణుకు శాఖ నూతన కార్యవర్గం ఆదివారం స్థానిక గమిని ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ముందుగా జిల్లా శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా కడించర్ల రాజరాజేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా అక్కిన కాశీ విశ్వనాథం, కార్యదర్శిగా కతారి కాశీ విశ్వనాధరాజు, కోశాధికారిగా వంగూరి హనుమంతరావు, సహాయ కార్యదర్శిగా ఒబిలిశెట్టి మురళీ హరినాథ్, కార్య నిర్వాహక సభ్యులుగా ఆర్ఎస్ఎం భూపాల్, డాక్టర్ కె.రామలక్ష్మి, యలమర్తి శ్రీనివాసరావు, నిడదవోలు సత్తిరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ మానవత సేవలు మానవత్వాన్ని చూపిస్తున్నాయని, ముఖ్యంగా దాతలు అందిస్తున్న దాతృత్వం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కతారి శారదాదేవి, మానవత విస్తరణ, అభివృద్ధి కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి, ఎసీవీ సతీష్ బాబు, వీవీ రామకృష్ణారావు, ఆనందం మస్తాన్‌రావు, ఎ.బాలాజీ, మల్లిన అరుణ సారథి, సభ్యులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

పెనుగొండ: నడిపూడిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని, నాలుగు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తణుకు ఎక్సైజ్ సీఐ ఎస్.మణికంత రెడ్డి తెలిపారు. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో నడిపూడికి చెందిన పుల్ల శ్రీనును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం కలిగి ఉన్నా, బెల్ట్ షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్సై మధుబాబు, కానిస్టేబుల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగు నిర్వహణపై అవగాహన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో ఆదివారం ఆయిల్‌పాం సాగు నిర్వహణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌పాం రీసెర్చ్ (ఐఐవోపీఆర్, పెదవేగి) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామచంద్రుడు మాట్లాడుతూ ఆయిల్‌పాం తోటలకు బాగా ఒడ్డు కట్టే మట్టి అనుకూలమని పేర్కొన్నారు. నీటి పారుదల, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటి వృథా తగ్గుతుందన్నారు. వర్షా కాలంలో నీరు నిల్వ చేయడానికి ట్రెంచ్ పద్ధతిని అనుసరించాలని సూచించారు. సేంద్రియ ఎరువులు, రసాయనిక ఎరువులు సమతుల్యంగా వినియోగించాలన్నారు. సూక్ష్మ పోషకాలు లోపించకుండా చూడాలన్నారు. అలాగే కీటకాలు, రోగ నివారణ, అంతర పంటలు, కోకో పంట నిర్వహణ తదితర అంశాలపై రైతాంగానికి అవగాహన కలిగించారు. ప్రగతి శీల రైతులు, గ్రామ సభ్యులు హేమ, జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ వంశీ, వీహెచ్ఏ పాల్గొన్నారు.



ఆయిల్ పామ్ సాగుపై రైతాంగానికి అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న యోగ సాధకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): యోగాను ప్రతి ఒక్కరూ అభ్యసించి, సాధన చేయాలని, తద్వారా ఆరోగ్యం సాధ్యమవుతుందని యోగ గురువు బడుగు చంద్రశేఖర్ అన్నారు. స్థానిక గుణ్ణం ఫంక్షన్ హాల్ ఆవరణలో ఆదివారం శ్రీ సత్యసాయి ధ్యాన మండలి నిత్య యోగా సాధన కేంద్రం ఆధ్వర్యంలో అభ్యసకులు పలు యోగా ఆసనాలు వేశారు. సీనియర్ యోగా సభ్యులను సత్కరించారు. యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా ప్రజలకు అవగాహన పెంచేందుకు ర్యాలీ నిర్వహించామని ఆయన తెలిపారు. అదే విధంగా సచివాలయం పరిధిలో మెడికల్ శిబిరం నిర్వహించారు. యోగా సాధకులు బీపీ పరీక్షలు చేయించుకున్నారు.

రావిపాడులో నేడు ర్యాలీ

పెంటపాడు: రావిపాడు గ్రామంలో సోమవారం ఉదయం 9 గంటలకు మెగా యోగా ర్యాలీ నిర్వహించనున్నట్లు గ్రామ కార్యదర్శి శేఖర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, సొసైటీ సిబ్బంది, మెడికల్, ఫీల్డ్ సహాయకులు, అన్ని శాఖల ఉద్యోగులు తప్పక పాల్గొనాలని ఈ సందర్భంగా కార్యదర్శి కోరారు.

వడ్రంగి కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

భీమవరం: జిల్లాలో వడ్రంగి కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేయూతనందించాలని జిల్లా వండ్రంగి పనివారల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చిట్టిమోజు భోగేశ్వరరావు, చిప్పాడ చంద్రశేఖర్ అన్నారు. జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆదివారం భీమవరం మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 24 లక్షల మంది వడ్రంగి కార్మికులున్నారని ప్రభుత్వ పరంగా ఎటువంటి సహాయం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్రంగి కార్పోరేషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వం సబ్సిడీ రుణాలు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై కమిటీ సభ్యులతో ప్రమాన స్వీకారం చేయించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి లక్కోజు సుబ్రహ్మణ్యం, గౌరవాధ్యక్షులు అరసవల్లి రామచంద్రరావు, వెంకటాపు శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షులు చింతోజు పాండురంగాచార్యులు, ములగాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వడ్రంగి కార్మికులకు జ్ఞాపికలు అందిస్తున్న పాకా సత్యనారాయణ

ఈఏపీసెట్‌లో శశికి ర్యాంకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ ఈఏపీసెట్‌లో శశి టౌన్ బెస్ట్‌గా నిలిచిందని విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి గోపాలకృష్ణ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో స్టేట్ 509వ ర్యాంక్ సాధించిన పీఆర్‌వీఎస్ దుర్గా చరణ్ టౌన్ ప్రథమ స్థానంలో నిలిచాడని, వీటీఆర్ చరణ్ 1115వ ర్యాంక్, కె.దేవిక 1305, ఎ.లికేంద్రసాయి 1965 ర్యాంకు సాధించారు. 3 వేల లోపు ఏడుగురు, 5 వేల లోపు 15 మంది, 10 వేల లోపు 30 మందికి ర్యాంక్‌లు వచ్చినట్లు వెల్లడించారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో డీసీహెచ్ శ్రీవిద్య 4695 ర్యాంక్, 20 వేల లోపు 10 మంది విద్యార్థులు ర్యాంక్‌లు సాధించినట్లు చెప్పారు. విద్యార్థులను వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, అకడమిక్ డెరెక్టర్ క్రాంతి సుధ అభినందించారు.

ఘనంగా అన్నసమారాధన

నరసాపురం: హనుమద్ జయంతి ముగింపు వేడుక సందర్భంగా పట్టణంలోని 31వ వార్డు చినమామిడిపల్లి ఆంజనేయస్వామి గుడి వద్ద ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలుచేశారు. సుమారు 3వేలమంది అన్న సమారాధనలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు.

ఎట్టకేలకు జాతీయ రహదారికి మరమ్మతులు

ఆకివీడు: జాతీయరహదారి నెం.165కు ఎట్టకేలకు మరమ్మతులు ప్రారంభించారు. రెండున్నర దశాబ్దాలుగా రహదారి పునర్నిర్మాణం జరగలేదు. విస్తరణ ఊసేలేదు. ఏళ్ల తరబడి ప్రజలు, ప్రయాణీకులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నా ఆ శాఖ అధికారులకు గానీ ప్రజా ప్రతినిధులకు గానీ పట్టలేదు. 1995 ప్రాంతంలో ఆర్ అండ్ బీ రహదారుల శాఖపరిధిలో పాలకొల్లు–పామర్రు(పీపీ) రోడ్డుగా ప్రసిద్ధి చెందిన ఈ రోడ్డును అప్పటి ఎంపీ కనుమూరి బాపిరాజు జాతీయ రహదారుల శాఖలో విలీనం చేశారు. పామర్రు–దిగమర్రు రోడ్డుగా దీనిని జాతీయరహదారుల శాఖ గుర్తించింది. తదనంతరం రహదారికి ఒక లేయర్ నిర్మాణ పనులు చేపట్టారు. అప్పటి నుంచి నేటి వరకూ ప్రజా ప్రతినిధులు మారుతున్నా, జాతీయ రహదారుల శాఖ అధికారులు బదిలీ అవుతున్నా సమస్య మాత్రం అంగుళమైనా కదలలేదు. రహదారికి ఇరువైపులా ప్రపంచ బ్యాంక్ నిధులతో అప్పట్లోనే పక్కా డ్రెయినేజీని కొంత మేర నిర్మించారు. ప్రస్తుతం ఆ డ్రెయిన్ అక్కడక్కడా కన్పిస్తుంది. రహదారి విస్తరణ పనులు చేపట్టకపోవడంతో వాహనాల రద్దీ పెరిగి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.



ఆకివీడు నుంచి భీమవరం వరకూ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి కథనాలతో కదలిక

జాతీయ రహదారి నె. 165 అభివృద్ధి, విస్తరణ కోసం 'సాక్షి'లో పలుసార్లు కథనాలు వెలువడ్డాయి. ఇటీవల ఈ విషయం కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ దృష్టికి సమస్య వెళ్లడంతో రహదారి మరమ్మతులను అధికారులు చేపట్టారు. అలాగే విస్తరణ పనులను కూడా వేగంగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఉప్పుటేరు వంతెన వద్ద నుంచి భీమవరం వరకూ రహదారి నాలుగు లైన్ల విస్తరణకు సరిపడే స్థలం ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో కొన్ని చోట్ల ఆక్రమణలకు గురయ్యాయి.

ఉపాధికి ఊతమేదీ?



ఉపాధి పనులు చూపాలంటూ వెంకట్రామపురంలో వినతిపత్రం అందిస్తున్న కూలీలు (ఫైల్)

పెనుగొండ: వ్యవసాయ కార్మికులకు పనుల్లేని కాలంలో ఉపాధి పనులు చూపి వారి జీవనోపాధికి అండగా నిలవడానికి ప్రారంభించిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం లక్ష్యం నీరుగారుతుంది. సాగులో యాంత్రికరణ రావడంతో వ్యవసాయ కార్మికులకు ఉపాధి అవకాశాలు రోజు రోజుకు సన్నగిల్లుతున్నాయి. ఈ తరుణంలో జాతీయ ఉపాధి హామీ పథకంపైనే ఉపాధి కూలీలు ఆశలు పెట్టుకున్నారు. ఉపాధి పనులతో ఎంతో కొంత జీవనోపాధి లభిస్తుందని ఆశ పెట్టుకున్న ఉపాధి కూలీలకు నిరాశే మిగులుతుంది. దీని కోసం భారీగానే జాబ్ ఖార్డులకు దరఖాస్తు చేసుకుంటున్నారు. పెనుగొండ మండలంలో 8,452 జాబ్ కార్డు ఉండగా, 12873 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. జాబ్ కార్డులు 6,077 యాక్టివ్‌గా ఉండగా,8,799 మంది ఉపాధి కూలీలు పనులు చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. అయితే, వీరికి ఉపాధి పనులు చూపడంలో అధికారులు విఫలం అవుతున్నారు.



కొరాలపర్రులో ఇటీవల ప్రారంభించిన ఉపాధి పనులు (ఫైల్)

నిబంధనలతో ఇబ్బంది

ఉపాధి పనులు చూపించడానికి నిబంధనలు అడ్డురావడం, కొన్ని గ్రామాల్లో పనులు గుర్తించి, చేయించడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు కొరత కొట్టుమిట్టాడుతుండడంతో ఉపాధి కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో పూర్తి స్థాయిలో ఉపాధి పనులు చూపలేకపోయారు. వెంకట్రామపురం గ్రామంలో కనీసం ఒక రోజు పని సైతం కల్పించలేకపోయారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇటీవల ఆ గ్రామానికి చెందిన వీఆర్‌ఏ బుంగా గణేష్ కల్పించుకోవడంతో కొంత మేర పనులు మొదులుపెట్టారు. పెనుగొండ, సిద్ధాంతంల్లో అయితే కేవలం రెండు వారాలు మాత్రమే పని దినాలు చూపించగలిగారు, ములపర్రు, మునమర్రు, తామరాడల్లో పనులు గుర్తించి, చేయించడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో పనులు సక్రమంగా జరిగే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో పథక లక్ష్యానికి తూట్లు పడి, ఉపాధి కూలీలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. అధికారులు స్పందించి పనులు చూపాలంటూ ఆయా గ్రామాల ప్రజలు ఇటీవల వినతి పత్రాలు సైతం సమర్పించారు. ఇప్పటికైన ఎన్ఆర్ఈ జీఎస్ పథక లక్ష్యాలు నెరవేర్చడానికి పూర్తి స్థాయి చర్యలు తీసుకోవాలంటూ పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉపాధి పనులు చూపాలి



ఉపాధి కూలీలకు పనిదినాలు చూపాలి. ఉపాధి పనులు చూపించ పోవడంతో ఉపాధి కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారు. కొన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు నియామకం చేపట్టడంలో నిర్లక్ష్యం వహించడంతో ఉపాధి కూలీలు తీవ్రంగా నష్ట పోతున్నారు. అధికారులు స్పందించి ఉపాధికి చేయూతనివ్వాలి.

– షేక్‌పాదుషా, కార్యదర్శి వ్యవసాయ కార్మిక సంఘం

రోడ్లపై విచ్చలవిడిగా పశువుల సంచారం

భీమవరం అర్బన్: రోడ్లపై అడ్డదిడ్డంగా తిరిగే పశువుల కారణంగా నిత్యం ప్రజలకు, వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో కొత్తపూసలమర్రు, గూట్లపాడు, దొంగపిండి, గొల్లవానితిప్ప గ్రామాలలో మెయిన్ రోడ్డులోనే కాకుండా ఏ వీధిలో చూసిన వందలాది ఆవుల మంద కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలపై వెళ్లే సమయంలో అకస్మాత్తుగా రోడ్లపైకి వచ్చే పశువులతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అంతే కాకుండా స్కూలకి వెళ్లే విద్యార్థులను ఆవుల కొమ్ములతో పొడిచి గాయపరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు బారిన పడుతున్నవారి సంఖ్య రోజూ పెరుగుతూనే ఉంటుంది. ఆయా గ్రామాల లో ఆవుల యజమానులు కట్టకుండా పాలు తీసుకుని రోడ్లపైకి వదిలేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రాత్రిళ్లు రోడ్లపై గుంపులుగా ఆవులు వాహనాలకు అడ్డుగా నిలబడటమే కాకుండా ప్రమాదాలకు కార ణమవుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. వాహనదారులు హారన్ కొడుతున్న ప్పుడు పశువులు భయంతో పరుగులు పెడుతూ ద్విచక్ర వాహనాలపైకి దూసుకొ స్తున్నాయని వాహనదారులు ఆవేదన వ్య క్తం చేస్తున్నారు. దీంతో ఆస్పత్రిలో వైద్య ఖ ర్చులకు, వాహనాల మరమ్మతులకు తడిసిమోపెడవుతుందని పలువురు వాపోతున్నారు.



మెయిన్‌రోడ్డుపై ఆవులు సంచరించడంతో వాహనచోదకుల ఇబ్బందులు

ప్రధాన కూడళ్లల్లో భయపెడుతున్న ఆవులు

కొత్తపూసలమర్రు, గూట్లపాడు, గొల్లవానితిప్ప గ్రామాలలో మెయిన్ రోడ్లపై వందలాది ఆవులు గుంపులుగా తిరుగుతూ వాటి కొమ్ములతో దాడి చేస్తున్నాయని పలువురు గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో తమ పిల్లలను రోడ్లపైకి పంపించాలంటే భయమేస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. అలాగే మండలంలో రొయ్యలు, చేపలు చెరువులు ఎక్కువగా ఉండటంతో పశుగ్రాసం కోసం ఆవులు మందలుగా గట్లపై తిరుగుతూ గట్లను ధ్వంసం చేస్తున్నాయని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

వందలాది ఆవులు రోడ్ల పైకి వచ్చి దాడులు చేస్తున్నా పంచాయతీ అధికారులు, పాలక వర్గ సభ్యులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వెల్లువెత్తున్నాయి. పశువులను గ్రామంలో లేకుండా దూరంగా తోలుకుని వెళ్లాలని లేకుంటే బందెల దొడ్డి ఏర్పాటు చేసి పశువుల యజమానులకు జరిమానాలు విధించాలని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆవుల యజమానులకు నోటీసులు ఇచ్చి హెచ్చరించాలని ఆయా గ్రామస్తులు కోరుకుంటున్నారు.